తప్పుల తడకగా కుల గణన

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి గౌడ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ, కుల గణన తప్పుల తడకగా ఉందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన నివేదికను ఆయన వ్యతిరేకించారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 52 శాతం ఉన్నట్లు తేలిందన్నారు. పదేళ్ల తర్వాత బీసీ జనాభాను 46 శాతంగా చూపి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. 7 శాతం ఉన్న అగ్రకుల జనాభాను మాత్రం 15 శాతంగా చూపించి, బీసీలపై కుట్ర చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సమగ్ర కుటుంబ కుల గణన సర్వేలో జరిగిన తప్పులను సవరించి బీసీలకు న్యాయం జరిగే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.

సర్వే ఫలితాలను పున: సమీక్షించాలి

సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జరిపిన కులగణన సర్వేలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల జనాభాను తక్కువ చేయడం మూలంగా ఇట్టి సర్వే పూర్తిగా తప్పుడు గణాంకాలని సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి అన్నారు. సర్వే ఫలితాలు పున: సమీక్ష చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలలో జరిగే ఎన్నికల్లో టీచర్స్ ఎమ్మెల్సీ ఉమ్మడి జల్లాలు నల్గొండ, వరంగల్, కమ్మం అభ్యర్థి ప్రొఫెసర్ టి.వెంకట రాజయ్యకు సమాజ్ వాది పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో రాములు, ఏ.బాబు గౌడ్, వెంకటేశ్వర్లు, టి.వెంకట రాజయ్య, రిజ్వాన్, శ్రీహరి ముదిరాజ్ పాల్గొన్నారు.

సర్వే పూర్తిగా బూటకం

గౌడ కల్లు గీత వృత్తిదారుడుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిల వెంకన్న గౌడ్

వెంకన్న గౌడ్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4: తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన బీసీ కుల గణన సర్వే రిపోర్టు పూర్తిగా బూటకపు సర్వే అని తెలంగాణ గౌడ కల్లు గీత వృత్తిదారుడులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిల వెంకన్న గౌడ్ అన్నారు. చిక్కడపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకన్న గౌడ్ మాట్లాడారు. ఈ సర్వేలో గత 2014 సమగ్ర కుటుంబ సర్వేలో 51 శాతం ఉన్న బీసీల సంఖ్య, ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన సర్వేలు 46 శాతానికి కుదించడం పట్ల దుర్మార్గం అని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అగ్ర కులాల సంఖ్యను రెట్టింపు చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీల సంఖ్యను గణనీయంగా తగ్గించి చూపడం హేయమైన చర్య అని మండిపడ్డారు.

బీసీలతో అఖిల పక్ష కమిటీ ఏర్పాటు చేయాలి

నారాయణ గౌడ్

కుల గణనపై వస్తున్న ఆరోపణపై డెడికేషన్ కమిటీ, బీసీ కుల సంఘాలతో అఖిల పక్ష కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. బాగ్ లింగంపల్లిలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక సామాజికి వర్గం జనాభా ఎక్కువ చూపించారని, బీసీల జనాభా తక్కువ చూపించినట్లు నివేదికపై అనేక ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. దీనిపై గ్రామ స్థాయిలో బీసీ కులాలు ఆందోళన చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు 46 శాతంగా చూపించిన కమిటీ నివేదిక ఏ కుల జనాభా ఎంత లెక్కలు చూపవలసిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.

బీసీలను అణగదొక్కే కుట్ర

ఓసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు పెరిగి బీసీల జనాభా తగ్గడమేంటి ?

రవీంద్రభారతి, ఫిబ్రవరి 4: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన నివేదిక తప్పుల తడకగా తయారైందని, బీసీలను రాజకీయంగా అణగదొక్కడానికి కుట్రలో భాగమమని, ఈడబ్ల్యూస్ రిజర్వేషన్లు కాపాడుకునేందుకే అగ్రవర్ణాల జనాభాను పెంచి చూపారని ఆరోపిస్తున్నాం అని తెలంగాణ రాష్ట్ర ప్రజారాజ్యం పార్టీ అధినేత జిలుకర రవి కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. రాష్ట్ర జనాభా 3 కోట్ల 70 లక్షలు ఉండగా, దానిలో బీసీ జనాభా కోటి 84 లక్షలుగా చూపించారని, ప్రస్తుతం, ప్రభుత్వం విడుదల చేసిన కులగణన నివేదికలో బీసీ జనాభా కోటి 64 లక్షలుగా తగ్గించి చూపించారని ఆయన విమర్శించారు. బీసీల జనాభా తగ్గించడంలో కాంగ్రెస్ పార్టీ కుట్రలో ఒక భాగమన్నారు. బీసీలను రాజకీయంగా అణగ దొక్కే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. 2011లో ఓసీల జనాభా 10 శాతం లోపే ఉండగా, ప్రస్తుతం 15.79 శాతం పెరిగినట్లు చూపించారని, ఓసీలు పెరిగితే బీసీలు తగ్గడమేమిటని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత సర్వే ఫలితాలను పూర్తిగా సమీక్షించి నిజమైన గణాంకాలను వెల్లడించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేసన్లు పెంచాలని, విద్యా, ఉద్యోగ రంగాలలో 52% పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల జనాభా తగ్గిస్తే రాష్ట్ర ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీల తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. 2014 లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ చేసిన సమగ్ర సర్వే నిజమైనదని ఆయన చెప్పారు.

బీఆర్ఎస్ అధినేతకు వివాహ ఆహ్వానం

తన మేనల్లుడు సాయి ప్రసాద్ యాదవ్ వివాహానికి హాజరవాలని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేసిన బీఆర్ఎస్ గోషామహల్ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్, చిత్రంలో తదితరులు.

– కార్వాన్, ఫిబ్రవరి 4;

బేగంపేట పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఆకర్షణ సతీశ్, ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా నిమ్స్ దవాఖానలోని రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో తన 19వ లైబ్రరీని ఏర్పాటు చేశారు. నగర సీపీ సీవీ ఆనంద్, డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, చిన్నారి ఆకర్షణ సతీశ్‌తో కలిసి మంగళవారం సాయంత్రం లైబ్రరీని ప్రారంభించారు. *– ఖైరతాబాద్, ఫిబ్రవరి 4;*

బీమా రంగంలో ఎఫ్‌డీఐ పెంపు సరికాదు

కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా ఏఐఐఈఏ నిరసన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని పెంచడం సరైన నిర్ణయం కాదని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఆరోపించింది. ఈ మేరకు ఏఐఐఈఏ పిలుపు మేరకు భారత జీవిత బీమా సంస్థ సిటీ బ్రాంచి-7 ఉద్యోగులు మంగళవారం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విదేశీ ప్రత్యక్ష పెట్టుడుల పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతున్నట్లు తీసుకున్న నిర్ణయంతో భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి అవసరమైన మూల ధన సమీకరణపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. దీని వల్ల విదేశీ భాగస్వామ్య కంపెనీలు స్వతంత్ర సంస్థలను స్థాపిస్తే భారతీయ కంపెనీలపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కంపెనీలను ప్రతికూల బిడ్స్ ద్వారా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు కూడా జరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలు కార్పొరేట్ ప్రయోజనం కోసం కాకుండా, ప్రజా ప్రయోజనాల కోసం మారుస్తూ, లాభాల కంటే ప్రజా సంక్షేమమే పరమావధిగా రూపొందించాలని ఏఐఐఈఏ తరపున సూచించారు. కార్యక్రమంలో బ్రాంచి సెక్రటరీ రమేశ్ గౌడ్, ఉపాధ్యక్షులు బాలకృష్ణ, వెంకటరమణ, సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రతిభాదేవి, సుచిత్ర, శ్రావ్య, జయాబాయి పాల్గొన్నారు.

గార్డెన్ ఫెస్టివల్-2024లో భాగంగా ల్యాండ్ స్కేప్ గార్డెన్స్ నిర్వహణకు గాను హార్టికల్చర్ డైరెక్టర్ నుంచి మంగళవారం హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేశ్ గోల్డ్ గార్డెన్ సర్టిఫికెట్ అందుకున్నారు.

– సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ);

బూటకపు ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలి

ఆదివాసీల హత్యలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే సమగ్ర విచారణ జరిపించాలి

హైదర్‌గూడలోని ఎన్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 4: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కొనసాగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలని పలువురు వక్తలు ముక్త కంఠంతో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ రావు, హైకోర్టు న్యాయవాది సురేశ్ కుమార్, చైతన్య మహిళా సంఘం వేదిక రాష్ట్రకో-కన్వీనర్ జి. జ్యోతి మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, గంగులూరులో ఈ నెల 1న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు చనిపోయినట్లుగా ఆ రాష్ట్ర పోలీసులు ప్రకటించారని తెలిపారు. గత 13 నెలల కాలంలో 352 మందిని చంపితే ఇందులో ఆదివాసీలు, గిరిజనులే 250 మందికి పైగా ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మనిషి జీవించే హక్కు పట్ల ఏ ప్రభుత్వమైనా బాధ్యతాయుతంగా ఉండాలే తప్ప వెంటాడి చంపివేయడం చట్ట విరుద్ధమని మండి పడ్డారు. డబుల్ ఇంజన్ సర్కార్‌గా ప్రకటించుకున్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాలన చేస్తుందని విమర్శించారు. ఆపరేషన్ కగార్ హత్యాకాండను ఆపివేసి, ఆదివాసీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 600 పోలీస్ క్యాంపులను తక్షణమే ఎత్తివేయాలన్నారు. ఆదివాసీ హత్యలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిచే సమగ్రమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దేశంలోని ప్రజాస్వామిక వాదులు, హక్కుల సంఘాల నేతలు స్పందించి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొనేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో శ్రామిక స్పందన జాతీయ కార్యదర్శి షేక్ షావలి, టీపీఎఫ్ నేత రాంబాబు, ప్రతినిధులు పద్మ కుమారి, చంద్రమౌళి, జాన్ పాల్గొన్నారు.

మాలలకు ద్రోహం తలపెట్టిన రేవంత్‌రెడ్డి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 4: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశంపై జస్టిస్ షమీర్ అక్తర్ నివేదికను నేడు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్ ఆమోదించి మాల ఉప కులాలకు తీరని ద్రోహం, వెన్నుపోటు పొడిచారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు ప్రకటించారు. మంగళవారం బషీర్‌బాగ్‌లో మాట్లాడుతూ, నివేదికలో మాదిగ కులాలకు 9%, మాల కులాలకు 5%, ఎస్సీ సంచార జాతులకు 1% రిజర్వేషన్లు కేటాయిస్తూ పూర్తిగా మాదిగలకు అధికంగా అవకాశాలు కల్పించి మాలలకు తీరని అన్యాయం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. నివేదిక శాస్త్రీయంగా జరగలేదని, అది పూర్తిగా కాంగ్రెస్, బీజేపీ, ఎమ్మార్పీఎస్‌లతో రాజకీయంగా కుమ్మక్కై, మాదిగలకు పక్షపాతం చూపారని విమర్శించారు. జాతికి వెన్నుపోటు పొడిచిన మంత్రులు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, వినోద్ వెంకటస్వామిలు నమ్ముకున్న మాలలకు ద్రోహం చేసి సీఎం రేవంత్‌రెడ్డికి పాలేర్లుగా మారారని విమర్శించారు.

రూ.5 లక్షల ప్రమాద బీమా రెన్యూవల్ చేయండి

ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోండి

బీఆర్‌టీయూ ఆటో యూనియన్ నాయకుల డిమాండ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): ఆటో డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసి ఆత్మహత్యలకు కారణమైన కాంగ్రెస్ సర్కార్, కనీసం మరణించిన ఆటో డ్రైవర్ల కుటుంబాలను కూడా ఆదుకోవడం లేదని బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబర్‌పేట్ డీడీ కాలనీలో ఆటో డ్రైవర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేముల మారయ్య మాట్లాడుతూ, రూ.5 లక్షల ప్రమాద బీమా అక్టోబర్ 2024లో రెన్యూవల్ గడువు ముగిసిందన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం రెన్యూవల్ చేయడం లేదని విమర్శించారు. ఆత్మహత్యలు చేసుకున్న డ్రైవర్ కుటుంబాలకు ఈ పథకం వర్తించకుండా ఉందని వివరించారు. కార్మిక శాఖలోని లేబర్ ఇన్సూరెన్స్ పాలసీలను ప్రైవేట్ సంస్థలకు ఇచ్చి ఆ సంస్థలతో లేబర్ అధికారులు కుమ్మక్కై అర్హులైన కార్మికులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం గతంలో లాగానే కొనసాగించాలని, లేని యెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు మహేశ్ దేశపాక్, సిటీ ప్రెసిడెంట్ నిరంజన్ పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి కొండా సురేఖకు వినతి

రామంతాపూర్, ఫిబ్రవరి 4: తెలంగాణ రాష్ట్రంలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం ఫెడరేషన్ ఆఫ్ ఆల్ బ్రాహ్మిణ్ అసోసియేషన్ వర్కింగ్ ప్రసిడెంట్ న్యాయవాది ఓగిరాల రమేశ్, ప్రధాన కార్యదర్శి గంగు నర్సిహమూర్తి, సమాఖ్య ప్రతినిధులు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం సమర్పించారు. దేవాలయాల్లో ఇతర ఉద్యోగులకు ఇస్తున్న అన్ని రకాల జీత భత్యాలు, పెన్షన్లు అర్చకులకు సమానంగా ఇవ్వాలని, శఠగోప సమర్పణలు అర్చకులకే ఇవ్వాలని మంత్రిని కోరారు. దేవాలయాల భూములు, ఆస్తుల పరిరక్షణ చేస్తూ ఇతర కార్యక్రమాలకు కేటాయించవద్దన్నారు. దేవాలయాల ఆదాయం హైందవేతర కార్యక్రమాలకు మళ్లించకూడదన్నారు. అనువంశిక అర్చకత్వం ఆంధ్రప్రదేశ్ మాదిరిగా అమలు చేయాలన్నారు. అర్చకులపై దేవాదాయ ఉద్యోగుల అజమాయిషీ ఉండొద్దన్నారు. టీటీడీ నుంచి రాష్ట్ర అర్చక సమాఖ్యకు రావాల్సిన 28 వేల కోట్లు తెలంగాణకు రావాల్సిన వాటాను వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. అన్ని విషయాలు తమ పరిధిలో ఉన్నంత వరకు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సమాఖ్య ప్రతినిధులు తెలిపారు.

అమరుల జయంతిని పండుగలా జరుపుకోవాలి

బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

వనస్థలిపురం, ఫిబ్రవరి 4: తెలంగాణ కోసం ఉద్యమించి ప్రాణ త్యాగాలు చేసిన అమరుల జయంతులను పండుగలా జరుపుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నేత, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, విశ్వకర్మ మనుమయ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గణేశ్ చారి అన్నారు. విశ్వకర్మ మనుమయ సంఘం 40వ వార్షికోత్సవాన్ని హస్తినాపురంలో మంగళవారం నిర్వహించారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్ర స్వామి నుంచి మారోజు వీరన్న వరకు పేదల పక్షాన నిలబడిన చరిత్ర విశ్వకర్మలకు ఉన్నదన్నారు. తెలంగాణ ఉద్యమంలో వారి పాత్ర మరువలేనిదన్నారు. మారోజు వీరన్న, ప్రొ. జయశంకర్ సార్, శ్రీకాంత్ చారిలు అమరులయ్యారని గుర్తు చేశారు. వారిని తెలంగాణ ఎప్పటికీ మరిచిపోదన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం తమను విస్మరిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటుందన్నారు. ఇలాగే, కొనసాగితే రేవంత్ రెడ్డిని గద్దె దింపుతామన్నారు. అనంతరం, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎర్రవెల్లి బాలాచారి, శ్రీరాములు చారి, శ్రీనివాసాచారి, భాస్కరాచారి, శంకరాచారి, రమేశ్ చారి పాల్గొన్నారు.

నిమ్స్‌లో క్యాన్సర్‌పై అవగాహన వాక్

ప్రారంభించిన డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

అవగాహన వాక్ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఖైరతాబాద్, ఫిబ్రవరి 4: ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిమ్స్ దవాఖానలో మంగళవారం అవగాహన వాక్ నిర్వహించారు. ఈ వాక్‌ను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడుతో కలిసి ప్రారంభించారు. డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ, క్యాన్సర్‌కు వయస్సుతో భేదం లేదని, సరైన సమయంలో గుర్తించడం, రోగికి అవగాహన, ప్రోత్సాహం, ధైర్యం కల్పించడంతో పాటు ఆధునిక చికిత్స విధానంలో నయం చేయవచ్చన్నారు. ఆరోగ్యశ్రీ లాంటి పథకాలతో నిమ్స్‌కు వచ్చే రోగులకు పూర్తిగా ఉచితంగా చికిత్సను అందిస్తున్నామన్నారు. డాక్టర్ సదాశివుడు మాట్లాడుతూ, 'యునైటెడ్ బై యూనిక్' అనే థీమ్‌తో ప్రతి ఒక్కరినీ ప్రత్యేక దృష్టితో రోగ నిర్ధారణ చేసిన క్యాన్సర్‌కు చికిత్స అందించాలనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించామన్నారు.

క్యాన్సర్ రిజిస్ట్రీ డాటా పుస్తకం ఆవిష్కరణ

నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో భారతదేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య, అందిస్తున్న చికిత్స విధానాలు తదితర అంశాలతో రూపొందించిన క్యాన్సర్ రిజిస్ట్రీ పుస్తకాన్ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, ఎగ్జిక్యూటీవ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్, ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిమ్స్ డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మి భాస్కర్, డాక్టర్ కృష్ణారెడ్డి, మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సు అకాడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ మార్త రమేశ్, సర్జికల్, రేడియేషన్, పాథాలజీ విభాగాలకు చెందిన డాక్టర్ రచన, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మౌనిక, డాక్టర్ రోషిణి, పారా మెడికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, ఫీజియోథెరపి విభాగం ప్రిన్సిపాల్ డక్టార్ శ్రావణ్, మీడియా ఇన్‌చార్జి సత్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తెలంగాణ అర్చక ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు

సమస్యల పరిష్కారం కోసం సమష్టి పోరు

- ఒక్కతాటి పైకి అర్చక ఉద్యోగాల సంఘాలు
- తెలంగాణ అర్చక ఉద్యోగ సంఘాల జేఏసీ ఏర్పాటు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 4: తెలంగాణ రాష్ట్రంలోని దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులు, ఉద్యోగ సంఘాలన్నీ తమ సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాయి. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో సమావేశమైన అర్చక, ఉద్యోగ సంఘాల నేతలంతా వివిధ సమస్యలపై మంగళవారం చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ఒత్తిడి పెంచాలంటే సమష్టిగా పోరాడటమే మార్గమని వారు నిర్ణయించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ సంఘాల జేఏసీ పేరుతో నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కమిటీ చైర్మన్‌గా గంగు ఉపేంద్ర శర్మ, కన్వీనర్‌గా బేతి రంగారెడ్డి, కో కన్వీనర్లుగా మూర్తి సత్యనారాయణ శర్మ, పరాశరం రవీంద్రాచార్యులు, టి.రత్నాకర్, రాకొండ మురళీధర శర్మ, కందూరి కృష్ణమాచారి, తోటకూర వెంకటేశ్వర్లు, చక్రధరాచార్యులను ఎన్నుకున్నారు. ఈద సందర్భంగా చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ, దేవాదాయ శాఖ పరిధిలో పనిచేస్తున్న అర్చకులు, ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాలకు చెందిన సంఘాలను ఒకే తాటి పైకి తెచ్చి సమస్యలపై నివేదిక రూపొందిస్తామని, నివేదిక వచ్చిన తర్వాత తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

కారు చీకట్లు.. చిట్టడవిలో...

స్టార్ గేజింగ్ క్యాంప్‌ను ప్రారంభించిన ఫారెస్ట్ డెవలప్‌మెంట్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): అర్ధరాత్రి చిట్టడవిలో చుక్కలు చూస్తూ, ఆకాశంలో జరిగే అద్భుతాలను భారీ టెలిస్కోప్ ద్వారా వీక్షించేలా వినూత్న కార్యక్రమాన్ని తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. మంచిరేవుల సమీపంలోని చిలుకూరు రిజర్వ్ ఫారెస్ట్‌లో సెరెన్ ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో స్టార్ గేజింగ్ క్యాంపును ప్రారంభించింది. హైదరాబాద్ అడ్వెంచర్ అండ్ ట్రెక్కర్ క్లబ్‌తో సంయుక్తంగా నైట్ క్యాంప్‌ను ప్రారంభించగా, 50 మంది ఔత్సాహికులతో తొలి బ్యాచ్ ప్రకృతి అందాలను అర్ధరాత్రి వీక్షించారు. క్యాంప్ వచ్చే పర్యాటకుల కోసం సీ స్టార్ స్మార్ట్ టెలీస్కోప్, డొబ్సియాన్ టెలీస్కోప్‌తో పాటు అంతరిక్షంలో ఉండే గ్రహాలను మరింత స్పష్టంగా చూసేందుకు వీలుగా సెలిస్ట్రాన్ అస్ట్రోమాస్టర్‌ను అందుబాటులో ఉంచినట్లుగా టీజీఎఫ్‌డీసీ ఈడీ రంజిత్ నాయక్ తెలిపారు. ప్రశాంతమైన వాతావరణం, కాలుష్య రహిత ప్రాంతంలో విశ్వంలో ఉన్న అద్భుతాలను వీక్షించేలా స్టార్ గేజింగ్ క్యాంప్‌ను తొలిసారి అడ్వెంచర్ టూరిస్టుల కోసం ఏర్పాటు చేశామన్నారు. దీంతో ఏకో టూరిజం కూడా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.